# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- "దీపం" పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- "ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన" మత్స్యకారులకు ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు.
- సంవత్సరానికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047ను రూపొందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ప్రకాశం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి దొనకండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.

===========================

తెలుగు ప్రజలందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీపావళి పండుగ శుభాకాంక్షలను సామాజిక మాధ్యమం వేదికగా తెలియజేశారు. "నరకాసుర వధ" తర్వాత ఇంటింటా దీపాలు వెలిగించుకొని సంతోషంగా నిర్వహించుకొనే వెలుగుల పండుగ దీపావళి అని ఆయన పేర్కొన్నారు. ఒక దీపాన్ని వెలిగించడం ద్వారా మన చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలినట్లుగా.. 'దీపం 2.0' పథకంతో ఈ దీపావళి పండుగను మరింత కాంతివంతం చేస్తున్నామన్నారు. రాష్ట్ర మహిళల కళ్లల్లో ఆనందం చూసేందుకు సంవత్సరానికి 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ ఆనంద దీపావళి.. రాష్ట్ర ప్రజల జీవితంలో కొత్త వెలుగులు నింపాలని చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

===========================

ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మత్స్య సంపద వృద్ధి చెందాలని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆకాంక్షించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో కార్యక్రమం కింద పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబరలోని వెంగళరాయ జలాశయంలో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని ఈరోజు

నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మత్స్యకారులు చేపల పెంపకంపై మరింత దృష్టి సారించాలని, మత్స్య సంపదతో వారికి ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందని అన్నారు. గిరిజనుల జీవనోపాదికి అవసరమైన వేట పరికరాలు, వలలు, బోట్లు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు వంటి వాటిని పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) నుంచి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "విజన్ డాక్యుమెంట్ 2047"పై చర్చించేందుకు నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యంతో సమావేశమైయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో నీతి ఆయోగ్‌కు సంబంధించిన సలహాదారులు, డైరెక్టర్లతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారని అధికారులు వెల్లడించారు. సంవత్సరానికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా "స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047" రూపొందించామని చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ అధికారులకు వివరించారు.

==========================

వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకాశం జిల్లా ఇంఛార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. జిల్లా ఇన్ చార్జ్ మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారిగా ఒంగోలు వచ్చిన ఆయన ఈరోజు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, ఎన్డీయే కూటమి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రకాశం జిల్లాను అందరి సహకారంతో సమగ్రాభివృద్ధి చేస్తామని అన్నారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఇటీవల ప్రకాశం జిల్లాను కూడా వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చారని తెలిపారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి దొనకండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి తెలియజేశారు.

==========================

ప్రపంచ ప్రఖ్యాత వైద్య శాస్త్రవేత్త, దివంగత డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును ఏదైనా ప్రభుత్వ వైద్య కళాశాలకు పెట్టాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంబంధిత వివరాలు అందజేశారు. ప్రపంచానికి పలు ఔషధాలు అందించిన శాస్త్రవేత్త యల్లాప్రగడ స్వస్థలం భీమవరం, చదువుకున్నది రాజమహేంద్రవరం కాబట్టి కొత్తగా ఏర్పడే ఏలూరు, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒకదానికి ఆయన పేరు పెట్టడం సముచితంగా ఉంటుందని పవన్ కళ్యాణ్ కోరారు.

==========================

మేరా యువ భారత్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఒక స్వయం ప్రతిపత్తి సంస్థను ఏర్పాటు చేయబోతోందని శ్రీకాకుళం జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి కె. వెంకట ఉజ్వల్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ... నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, న్యూఢిల్లీ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం... మై భారత్ ... మొదటి వార్షికోత్సవాలను పురస్కరించుకొని నరసన్నపేటలో ఈరోజు... "దివాలీ విత్ మై భారత్..." కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట ఉజ్వల్ మాట్లాడుతూ... యువతలో నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం "మేరా యువ భారత్" ను ఏర్పాటు చేస్తోందన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==========================

“ప్రజా దర్బార్” కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఈరోజు ఆయన “ప్రజా దర్బార్” కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, గ్రామాల్లో బోర్లు వేయించి, మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజులలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

=========================

భీమవరం పట్టణ రూపురేఖలను మార్చేదిశగా చర్యలు చేపడుతున్నామని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈరోజు భీమవరంలో ఆమె పట్టణ సుందరీకరణ పనులపై సంయుక్త కలెక్టర్, తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భీమవరం జిల్లా కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిందని, జిల్లా కేంద్రంగా ప్రత్యేకతను సంతరించుకొనేలా ఈ పట్టణాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధానంగా కూడళ్ళు, వంతెనలు, పార్కులు, ఖాళీ ప్రదేశాలలో వివిధ రకాల అలంకరణను చేపట్టడం జరుగుతుందని, వాటర్ ఫౌంటెన్ లు, మ్యూజికల్ ఫౌంటెన్ లు, విగ్రహాలకు లైటింగ్ ఏర్పాట్లు, వాల్ పెయింటింగ్స్, రకరకాల పూల మొక్కలు ఏర్పాటు చేయనున్నామని కలెక్టర్ వెల్లడించారు.

=========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నవంబర్ 2వ తేదీన విశాఖలో పర్యటించనున్నారని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, 100 రోజుల ప్రణాళిక తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష చేపడతారని కలెక్టర్ తెలిపారు. అధికారులంతా ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, 100 రోజుల ప్రణాళికలో చోటు కల్పించిన అంశాలు, ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఈరోజు కలెక్టర్ జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో ప్రాథమిక సమీక్ష నిర్వహించి, నివేదికలను పరిశీలించారు.

=========================

పట్టణ అభివృద్ధికి రహదారుల విస్తరణ ఆవశ్యకమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. ఈరోజు ఆయన స్థానిక శాసనసభ్యులు షాజహాన్ బాషా కలిసి మదనపల్లి పట్టణంలో పర్యటించి, రోడ్ల విస్తరణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనకు సంబంధించిన మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి సుదర్శన్ రెడ్డి అందజేస్తారు.

(వాయిస్ 27 సెకన్లు)

=========================

షాలీమార్ నుండి సికిందరాబాద్ వెళ్ళే రైలు ఈ మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాలకు బదులుగా ఒక గంటా 30 నిమిషాలు ఆలస్యంగా ఒంటి గంటా 45 నిమిషాలకు షాలీమార్ నుండి బయలుదేరుతుందని రైల్వే వర్గాలు వెల్లడించాయి. అలాగే సంత్రాగచ్చి నుండి సికిందరాబాద్ వెళ్ళే ప్రత్యేక రైలు సంత్రాగచ్చి నుండి ఈ మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు బదులుగా 5 గంటలు ఆలస్యంగా ఈ రోజు సాయంత్రం 5 గంటల 20 నిమిషాలకు బయలు దేరుతుందని అధికారులు తెలిపారు.

=========================

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయ్ మున్సిపల్ పాఠశాలలో ముందస్తు హరిత దీపావళి సంబరాలు ఈరోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మన సంస్కృతి సాంప్రదాయాల యొక్క విశిష్టతను తెలియజేసే విధంగా, సంబరాలు జరుపుతున్నామని, కాలుష్యం లేకుండా పర్యావరణ హితంగా దీపావళి జరుగుకోవడంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బృందాదేవి తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

============================

============================